క్లుప్తంగా

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం



ఐనవోలు: మండలంలోని సింగారం గ్రామానికి చెందిన సుధాకర్ అలియాస్ సుదయ్య ఇటీవల అనారోగ్య సమస్యలతో మృతిచెందాడు. బాధిత కుటుంబ సభ్యులను సింగారం పోలీస్ అసోసియేషన్ సభ్యులు బుధవారం పరామర్శించారు. ఈ సందర్భంగా సుధాకర్ కుటుంబ సభ్యులకు రూ.10 వేల ఆర్థికసాయం అందజేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ ప్రతినిధి మల్కాపురం లక్ష్మినారాయణ మాట్లాడుతూ సింగారంలో గతంలో మృతిచెందిన పలు కుటుంబాలకు భరోసా కల్పించామని గుర్తుచేశారు. ప్రతీఒక్కరు తమవంతు బాధ్యతగా నిరుపేద కుటుంబాలకు చేయూతనందించాలని సూచించారు. అసోసియేషన్ తరఫున మిల్స్ కాలనీ ఏఎస్సై బిల్లా రంగారెడ్డి, మునిగాల వెంకటేశ్వర్లు పోలీస్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

విజయవంతం చేయాలి



ఆత్మకూరు: తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా జూన్ 3వ తేదీన ప్రభుత్వ ఆదేశాల మేరకు రైతు వేదికలో నిర్వహించనున్న రైతు దినోత్సవాన్ని రైతులు విజయవంతం చేయాలని ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. నీరుకుళ్ల రైతు వేదిక వద్ద రైతులకు బుధవారం అవగాహన కల్పించారు. రైతులు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం రైతు వేదిక వద్ద రైతులకు భోజనాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

చికిత్స పొందుతున్న పారిశుద్ధ్య కార్మికుడి మృతి



యేసెబు (ఫైల్)

ఆత్మకూరు: రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయలపాలై చికిత్స పొందుతున్న పారిశుద్ధ కార్మికుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఆత్మకూరు మండలం అక్కంపేట గ్రామానికి చెందిన కొమ్ము యేసెబు (60) గ్రామ పంచాయతీలో తాత్కాలిక పారిశుద్ధ్య కార్మికుడిగా పనిచేస్తున్నాడు. సోమవారం ఉదయం అక్కంపేటలో రహదారి శుభ్రం చేస్తున్న సమయంలో వెనుకనుంచి మిర్చి లోడుతో వరంగల్ వెళ్తున్న టాటా ఏసీ వాహనంలో ఉన్న మిర్చి బస్తా తగిలి అతడు కిందపడ్డాడు. దాంతో యేసెబుకు తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. మృతుడి భార్య కొమ్ము ప్రేమలీల ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు బుధవారం తెలిపారు.

సీపీకి కృతజ్ఞతలు

వరంగల్ క్రైం: ఖాళీ స్థలాల్లో ఇళ్ల నిర్మాణం చేపట్టకుండా ఇబ్బందులకు గురిచేస్తూ భూ ఆక్రమణకు యత్నించిన ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసి బాధితులకు సత్వర న్యాయం చేసినందుకు అశోకకాలనీవాసులు హర్షం వ్యక్తం చేశారు. ఈమేరకు వరంగల్ పోలీస్ కమిషనర్ ఏవీ.రంగనాథ్‌ను బుధవారం కలిసి పుష్పగుచ్ఛాలు అందించి కృతజ్ఞతలు తెలిపారు. సుబేదారి పోలీస్‌స్టేషన్ పరిధిలోని అశోకకాలనీలో ఒకే ప్రాంతంలో 20 మంది వ్యక్తులు ప్లాట్లు కొనుగోలు చేశారు. ఈక్రమంలో ఇదే ప్రాంతానికి చెందిన కేశబోయిన శివ, కేలోతు నవీన్ వచ్చి ఆ స్థలంలో జరుగుతున్న నిర్మాణ పనులను నిలిపివేసి ఆ భూములు తమవేనని బెదిరింపులకు పాల్పడ్డారు. ఈ క్రమంలో బాధితులు సీపీకి ఫిర్యాదు చేశారు. దర్యాప్తు చేసిన అనంతరం ఆ స్థలం ప్లాట్లు కొనుగోలు చేసిన వ్యక్తులదేనని నిర్ధారణ అయింది. అలాగే, ఇద్దరు ఆక్రమణదారులపై సుబేదారి పోలీసులు కేసు నమోదు చేసి అరెస్టు చేశారు. దాంతో సీపీకి కాలనీవాసులు కృతజ్ఞతలు తెలిపారు.

నేడు నీటి సరఫరా బంద్

వరంగల్ అర్బన్: హనుమకొండలోని కొన్ని కాలనీలు, కాజీపేటకు గురువారం తాగునీటి సరఫరా ఉండదని బల్దియా ఈఈ శ్రీనివాస్ రావు ఒక ప్రకటనలో తెలిపారు. వడ్డేపల్లి ఫిల్టర్ బెడ్ పరిధిలో కాజీపేట మీదుగా వెళ్తున్న 900ఎంఎం డయా పైపులైన్‌కు బుధవారం లీకేజీ ఏర్పడిందని పేర్కొన్నారు. పైపులైన్‌కు మరమ్మతుల దృష్ట్యా తాగునీటి సరఫరాను నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

కేయూలో రేపు జెండావిష్కరణ

కేయూ క్యాంపస్: తెలంగాణ రాష్ట్ర అవతరణ, దశాబ్ది ఉత్సవాల సందర్భంగా కాకతీయ యూనివర్సిటీలో జూన్ 2న ఉదయం 8గంటలకు వీసీ ప్రొఫెసర్ తాటికొండ రమేష్ జాతీయ పతకాన్ని ఆవిష్కరించనున్నారు. అనంతరం సెనెట్‌హాల్‌లో జరగనున్న సాంస్కృతిక కార్యక్రమాల్లో బోధన, బోధనేతర సిబ్బంది హాజరు కావాలని రిజిస్ట్రార్ ప్రొఫెసర్ శ్రీనివాస్‌రావు సర్క్యులర్ జారీ చేశారు.

నిరీక్షణ

కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం

- కాంటా పెట్టకుండా తాత్సారం
- వాతావరణంలో మార్పులతో ఆందోళనలో అన్నదాతలు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు



ఆరబోసిన ధాన్యం వద్ద రైతులు

నడికూడ: నడికూడ మండలంలోని పలు ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రోజురోజుకు ధాన్యం పోగవుతోంది. పలు కారణాలతో కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు కాంటా పెట్టకుండా తాత్సారం చేస్తున్నారు. ఈక్రమంలో వాతావరణంలో మార్పులతో అన్నదాతలు ఆందోళనకు గురవుతున్నారు. అకాల వర్షాలతో చేతికొచ్చిన పంట ఎక్కడ తడిసిపోతుందోనని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు నామమాత్రపు తనిఖీలతో జాప్యం చేస్తున్నారని రైతులు చెబుతున్నారు.



పడిగాపులు పడుతున్న రైతులు

మండలంలోని ముస్త్యాలపల్లి గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద బస్తాల్లో నింపిన ధాన్యం కొనుగోలుకు సిద్ధంగా ఉన్నా, నాలుగు రోజులుగా ధాన్యం తరలించే వాహనాలు రావడం లేదని నిర్వాహకులు చెబుతున్నారని రైతులు వాపోతున్నారు. వాతావరణంలో మార్పులతో ఆందోళన చెందుతున్నా అధికారులు, పాలకులు పట్టించుకోవడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



తడిసిన ధాన్యాన్ని చూపిస్తున్న రైతు

రైతులకు అండగా బీఆర్‌ఎస్ ప్రభుత్వం



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి

నడికూడ: ప్రతిపక్ష పార్టీల నాయకుల మాటలు నమ్మొద్దని, రైతులకు బీఆర్‌ఎస్ ప్రభుత్వం అండగా ఉంటోందని పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అన్నారు. మండల కేంద్రంలో ఐకేపీ సెంటర్‌ను బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా కొనుగోలు కేంద్రంలోని రైతులు, హమాలీలతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చివరి ధాన్యం గింజ వరకూ ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని భరోసా ఇచ్చారు. అకాల వర్షానికి తడిసిన ధాన్యాన్ని కూడా కొనుగోలు చేస్తుందని తెలిపారు. ఈక్రమంలో రైతులంతా సమన్వయం పాటించాలని కోరారు. తప్పుడు ప్రచారం చేస్తున్న ప్రతిపక్ష పార్టీల మాటలు నమ్మవద్దని సూచించారు. కార్యక్రమంలో మాదారం పీఏసీఎస్ చైర్మన్ నల్లెల లింగమూర్తి, సర్పంచ్‌లు ఊర రవీందర్‌రావు, తిప్పర్తి సాంబశివరెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు దురిశెట్టి చంద్రమౌళి, ఊర సతీష్‌రావు, సుధాటి వెంకన్న, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

గన్నీ సంచుల పంపిణీలో నిర్వాహకుల ఇష్టారాజ్యం



గన్నీ సంచుల కోసం ఎగబడుతున్న రైతులు

శాయంపేట: వరి ధాన్యంలోని తేమను వ్యవసాయ విస్తరణ అధికారులు పరీక్షించి టోకెన్లు జారీ చేసినప్పటికీ సీరియల్ నంబర్ ప్రకారం కాకుండా కొనుగోలు కేంద్రం నిర్వాహకులు ఇష్టారాజ్యంగా గన్నీ సంచులు పంపిణీ చేస్తున్నారని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని పత్తిపాక గ్రామంలో బుధవారం గన్నీ సంచులు రావడంతో ఒక్కసారిగా రైతులు పెద్దసంఖ్యలో చేరుకొని సంచుల కోసం ఎగబడ్డారు. ఇదేరోజు టోకెన్ జారీ చేసిన వారికి కూడా గన్నీ సంచులు పంపిణీ చేశారని, వారం రోజుల క్రితం టోకెన్లు తీసుకున్న వారికి సంచులు ఇవ్వకపోవడంలో అంతర్యమేమిటని అన్నదాతలు ప్రశ్నించారు. ఉన్నతాధికారులు స్పందించి ఏఈఓలు జారీ చేసిన టోకెన్ల నంబర్ ఆధారంగా వరుస క్రమంలో గన్నీ సంచులు పంపిణీ చేయాలని రైతులు కోరుతున్నారు.

వైభవంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన మహోత్సవం



ధ్వజస్తంభానికి పూజ చేస్తున్న ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి, భక్తులు

పరకాల: పరకాల పట్టణంలోని ప్రసిద్ధ శైవక్షేత్రంగా విరాజిల్లుతున్న కుంకుమేశ్వర స్వామి దేవస్థానంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠ మహోత్సవ వేడుకలు బుధవారం వైభవంగా జరిగాయి. ప్రముఖ శైవాగమ పండితులు బ్రహ్మశ్రీ కోమాళ్లపల్లి సంపత్‌కుమార్ శర్మ ఆచార్యత్వంలో వేదమంత్రోచ్చరణతో ధ్వజస్తంభ ప్రతిష్ఠ మహోత్సవ వేడుకలకు పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో పరకాల మున్సిపల్ చైర్‌పర్సన్ సోదా అనిత, వైస్ చైర్మన్ రేగూరి విజయపాల్‌రెడ్డి, వ్యవసాయ మార్కెట్ చైర్మన్ బండి సారంగపాణి, ఆలయ చైర్మన్ గందె వెంకటేశ్వర్లు, ధ్వజస్తంభ దాత చందుపట్ల లక్ష్మీకాంతమ్మ - మల్లారెడ్డి కుటుంబ సభ్యులు, కౌన్సిలర్లు, ఆలయ ధర్మకర్తలు, భక్తులు పాల్గొన్నారు.

హమాలీకి తేలు కాటు

నడికూడ: మండల కేంద్రంలో ఐకేపీ సెంటర్‌లోని ధాన్యం బస్తాలను లారీలో లోడ్ చేస్తున్న క్రమంలో మండల కేంద్రానికి చెందిన హమాలీ అప్పం ఐలయ్య తేలు కాటుకు గురయ్యారు. దాంతో అతన్ని తోటి హమాలీలు ఆస్పత్రికి తరలించారు.

ఇంటర్ ఫెయిల్ అయిన విద్యార్థులకు ఉచిత శిక్షణ

న్యూశాయంపేట: ఇంటర్ ఫలితాల్లో ఫెయిల్ అయిన విద్యార్థులు తిరిగి పరీక్షల్లో ప్రతిభ కనబరిచేందుకు వారికి పదిరోజుల పాటు ఉచిత శిక్షణ అందించనున్నట్లు స్టూడెంట్ ఇస్లామిక్ ఇండియా ఆర్గనైజేషన్ వరంగల్ జిల్లా పబ్లిక్ రిలేషన్ సెక్రటరీ సయ్యద్ జుబేర్ అహ్మద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వివరాలకు 79954 41842 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

కొనసాగుతున్న బొడ్రాయి ప్రతిష్ఠాపన



విగ్రహాలపైన బియ్యం పోస్తున్న మహిళలు

ఎల్కతుర్తి: భీమదేవరపల్లి మండలంలోని వంగర గ్రామంలో బొడ్రాయి ప్రతిష్ఠాపన వేడుకలు బుధవారం రెండవ రోజుకు చేరుకున్నాయి. గ్రామశిల బొడ్రాయి, భూలక్ష్మి, మహాలక్ష్మి అమ్మవార్ల విగ్రహాలకు ధన్యాదివాసం (పండించిన ధాన్యాన్ని ప్రజలు తీసుకువచ్చి విగ్రహాలపైన పోయడం) నిర్వహించారు. కాగా, భక్తులు, గ్రామస్తులు కుటుంబసమేతంగా, బంధుమిత్రులతో కలిసి వేడుకలను వైభవంగా జరుపుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ రజిత, ఎంపీటీసీ కౌసల్య దంపతులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

డీసీసీబీ సేవలను సద్వినియోగం చేసుకోవాలి



ప్రారంభోత్సవంలో పాల్గొన్న బ్యాంకు అధికారులు, సొసైటీ చైర్మన్లు

ఆత్మకూరు: డీసీసీ బ్యాంకు సేవలను వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని డీసీసీబీ సీఈఓ చిన్నారావు సూచించారు. మండల కేంద్రంలోని బ్యాంకును నూతన అద్దె భవనంలోకి మార్చారు. ఈ సందర్భంగా బ్యాంకు నూతన భవనాన్ని బుధవారం ప్రారంభించి చిన్నారావు మాట్లాడారు. రైతులతో పాటు ఖాతాదారులకు బ్యాంక్ అనేక సదుపాయాలను కల్పిస్తోందని వివరించారు. కార్యక్రమంలో నోడల్ ఆఫీసర్ హరిత, బ్యాంక్ మేనేజర్ శ్వేత, సొసైటీ చైర్మన్లు కుసుమ శరత్‌బాబు, ఏరుకొండ రవీందర్, బొల్లం రాజు, సొసైటీ సీఈఓలు, బ్యాంక్ సిబ్బంది, సొసైటీ సిబ్బంది, బ్యాంక్ కస్టమర్లు పాల్గొన్నారు.

డిజిటల్, సైబర్ నేరాలపై అవగాహన



మాట్లాడుతున్న జగన్‌మోహన్‌రావు

హన్మకొండ కల్చరల్: వరంగల్ జిల్లా సీనియర్ సిటిజన్స్ ఫోరం ఆధ్వర్యంలో నెలవారీ సమావేశంలో భాగంగా డిజిటల్, సైబర్ నేరాలపై హనుమకొండలోని తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ భవనంలో బుధవారం అవగాహన సదస్సు జరిగింది. ఫోరం అధ్యక్షుడు డాక్టర్ అనసూరి చంద్రమౌళి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ముఖ్యఅతిథులుగా టీజీఓఏ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రావు, జనరల్ సెక్రటరీ ప్రవీణ్, జాయింట్ సెక్రటరీ రాజేష్ పాల్గొని మాట్లాడారు. ఆస్థాన తెలుగు కవిగా డాక్టర్ పల్లెరు వీరస్వామి, బహుభాషా కవిగా మహ్మద్ సిరాజుద్దీన్, గాయకుడిగా రామమూర్తి, సంగీత విద్యాంసులుగా జగన్నాథచార్యులను ఎన్నుకుని సన్మానించారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌కు చెందిన హెల్పేజ్ ఇండియా సంస్థ సభ్యుడు శ్యామ్‌కుమార్.. డిజిటల్ సేఫ్టీపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్‌తో అవగాహన కల్పించారు. హనుమకొండ సుబేదారి పోలీస్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ షుకుర్, డిజిటల్, సైబర్ నేరాలపై జాగ్రత్తలు వివరించారు.

క్షేత్రస్థాయిలో కమిషనర్ తనిఖీలు



పనులను తనిఖీ చేస్తున్న కమిషనర్ షేక్ రిజ్వాన్

వరంగల్ అర్బన్: నగరంలో పారిశుద్ధ్య నిర్వహణ, డివైడర్ల వెంట మొక్కల పెంపకం, నల్లాల నుంచి నీటి సరఫరా తీరుపై గ్రేటర్ వరంగల్ కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా బుధవారం ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. కరీంనగర్ రోడ్డులోని ఎల్లాపూర్ రోడ్డు నుంచి హసన్ పర్తి వరకు, నయీంనగర్, పబ్లిక్ గార్డెన్ మీదుగా హంటర్ రోడ్డు, కేఎంసీ వరకు సెంట్రల్ మీడియన్లలో మొక్కలకు నీటి సరఫరా, పెంపకం తీరు, సుందరీకరణను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. మొక్కలకు రోజూ నీరందించాలని, ఎండిపోతే చర్యలు తప్పవని సీఎంహెచ్‌ఓ మాధవరెడ్డిని ఆదేశించారు. ట్యాంకర్లు, సిబ్బంది పనితీరును తెలుసుకున్నారు.

తెలంగాణ జర్నలిస్ట్ ఫోరం ఆవిర్భావం



నయీంనగర్: జర్నలిస్టుల సంక్షేమమే ధ్యేయంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు అన్నారు. తెలంగాణ కోసమే తెలంగాణ జర్నలిస్టులు అనే నినాదంతో అల్లం నారాయణ నేతృత్వంలో ప్రారంభమైన తెలంగాణ జర్నలిస్టుల ఫోరం ఆవిర్భవించి 23 ఏళ్లు నిండిన సందర్భంగా హనుమకొండలో సంబురాలు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్, ఎమ్మెల్సీ కడియం శ్రీహరి, యూనియన్ హనుమకొండ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మస్కపురి సుధాకర్, నాయకపు సుభాష్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు బీఆర్.లెనిన్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పొగాకు వినియోగంతో క్యాన్సర్ ముప్పు



వంగరలో గ్రామస్తులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న వైద్యులు



దామెరలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

ఎల్కతుర్తి: పొగాకు వినియోగంతో క్యాన్సర్ ముప్పు పొంచిఉందని వైద్యులు తెలిపారు. ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని వైద్య, ఆరోగ్య శాఖ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో భీమదేవరపల్లి మండలం వంగరలో వైద్యులు రహమాన్, శ్రీనాథ్ ఆధ్వర్యంలో బుధవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పొగాకు ఉత్పత్తుల వాడకం వల్ల క్యాన్సర్ బారిన పడే ప్రమాదం ఉందని హెచ్చరించారు. బహిరంగ ప్రదేశాల్లో పొగ తాగటం చట్టవిరుద్ధమని తెలిపారు. అనంతరం, పొగాకు ఉత్పత్తులను వాడబోమని గ్రామస్తులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో కేఎల్ఎన్.స్వామి, స్వర్ణలత, మౌనిక, స్వరూప, ఆరోగ్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పొగాకు ఉత్పత్తులు ఆరోగ్యానికి హానికరం

దామెర: పొగాకు ఉత్పత్తులు ఆరోగ్యానికి హానికరమని మండల వైద్యాధికారి డాక్టర్ ఉషారాణి అన్నారు. ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవాన్ని పుస్కరించుకొని వైద్యశాఖ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో బుధవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పొగాకు వినియోగంతో ఊపిరితిత్తులు, గుండె సంబంధిత వ్యాధులతో పాటు క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులు సోకే ప్రమాదం ఉందని అన్నారు. ఈక్రమంలో ప్రతిఒక్కరూ పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉంటూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ఎండీ.జాకీర్‌అలీ, పీఏసీఎస్ చైర్మన్ బొల్లు రాజు, సూపర్‌వైజర్ శ్రీకాంత్, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

పేదలకు డబుల్ బెడ్రూం ఇళ్లు మంజూరు చేయాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఐనవోలు: పేదలందరికీ డబుల్ బెడ్రూం ఇళ్లు నిర్మించి ఇవ్వాలని సీపీఎం హనుమకొండ జిల్లా కార్యదర్శి బొట్ల చక్రపాణి డిమాండ్ చేశారు. ఈమేరకు తహసీల్దార్ కార్యాలయం వద్ద సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో బుధవారం ధర్నా నిర్వహించారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ బొనగోని రాజేష్‌కు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీఓ నంబర్లు 58, 59 ప్రకారం గుడిసెలు వేసుకున్న పేదలకు పట్టాలు ఇవ్వాలని కోరారు. వెంకటాపూర్ గ్రామం సర్వాపురంలోని సర్వేనంబర్ 324/సీ భూమి అన్యాక్రాంతం కాకుండా హద్దులు ఏర్పాటు చేసి ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని సూచించారు. నందనం గ్రామం జగ్గయ్య గూడెం 955 సర్వే నంబర్‌లోని భూమిని పేదలకు పంచాలని పేర్కొన్నారు. సాదాబైనామాలు దరఖాస్తు చేసుకున్న రైతులకు పట్టా ఇవ్వాలని కోరారు. తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఎం.చుక్కయ్య మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాల వద్ద ధాన్యం తడిసి ముద్దవగా అన్నదాతలకు భరోసా కల్పించాల్సిన అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని విమర్శించారు. మండలంలోని ప్రభుత్వ భూముల రక్షణ కోసం మండల కేంద్రం నుంచి కలెక్టరేట్ వరకు పాదయాత్ర నిర్వహించి ప్రజలను చైతన్య పరుస్తామని సీపీఎం మండల కార్యదర్శి కాడబోయిన లింగయ్య హెచ్చరించారు. కార్యక్రమంలో మండల కమిటీ సభ్యుడు నారాయణరెడ్డి, రైతు సంఘం మండల అధ్యక్షుడు మడిగె నాగరాజు, శంకర్‌రెడ్డి, రాంకుమార్, కవిత, యాకయ్య, గోపాల్‌రావు, పోచమ్మ, సృజన, బాబు, యాదగిరి, సంపత్, వీరస్వామి, రాజశేఖర్, సుగుణ, భాగ్య, అమ్మాయి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలి



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

దామెర: ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గోవిందు నరేష్‌మాదిగ డిమాండ్ చేశారు. జూన్ 3నుంచి 12వరకు ఉమ్మడి వరంగల్ జిల్లా మహాసభలకు సంబంధించిన కరపత్రాలను మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ అధిష్ఠానం చొరవ తీసుకొని పార్లమెంట్‌లో బిల్లు ప్రవేశపెడితే సమస్య పరిష్కారం అవుతుందని పేర్కొన్నారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చి తొమ్మిదేళ్లు పూర్తయినా ఇచ్చిన హామీ మాత్రం అమలు కాలేదని విమర్శించారు. జూన్4న హనుమకొండ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో నిర్వహించనున్న సభకు మాదిగ, ఉప కులాలకు చెందినవారు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల ఇన్‌చార్జ్ జిల్లెల్ల మురళి, జాతీయ అధికార ప్రతినిధి బొర్ర భిక్షపతి, రాష్ట్ర నాయకులు కడార్ల నవీన్, పాముల సబ్బయ్య, దామెర సర్పంచ్ గురిజాల శ్రీరాంరెడ్డి, గోవిందు కరుణాకర్, వడ్డెపల్లి రాజేందర్, రేణుకుట్ల సదయ్య, గోవిందు మహిపాల్, బొట్ల ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

దశాబ్ది ఉత్సవాలను వైభవంగా నిర్వహించాలి



సమావేశానికి హాజరైన జెడ్పీ చైర్మన్ సుధీర్‌కుమార్, తదితరులు

ఎల్కతుర్తి: తెలంగాణ దశాబ్ది ఉత్సవాలను వైభవంగా నిర్వహించాలని జెడ్పీ చైర్మన్ మారెపల్లి సుధీర్‌కుమార్ సూచించారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో బుధవారం ఏర్పాటు చేసిన అధికారులు, ప్రజాప్రతినిధుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వేడుకల్లో భాగంగా రోజుకో కార్యక్రమం చేపట్టాలని వివరించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో ఎంపీపీ మేకల స్వప్న, ఎంపీడీఓ తూర్పాటి సునీత, తహసీల్దార్ గుజ్జుల రవీందర్ రెడ్డి, వైస్ ఎంపీపీ తంగెడ నగేష్, సింగిల్ విండో చైర్మన్ శ్రీపతి రవీందర్‌గౌడ్, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు బూర్గుల రామారావు, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు కడారి రాజు తదితరులు పాల్గొన్నారు.

శాయంపేటలో..

శాయంపేట: మండలంలో దశాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని వరంగల్ జిల్లా జెడ్పీ చైర్‌పర్సన్ గండ్ర జ్యోతి సూచించారు. మండల కేంద్రంలోని మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో దశాబ్ది ఉత్సవాలపై బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్వరాష్ట్రంలో పదేళ్లకు చేరుకున్న ప్రగతి ప్రస్థానాన్ని ప్రజలందరికీ తెలిసేలా తెలంగాణ ఘనకీర్తిని పండుగ వాతావరణంలో నిర్వహించాలని వివరించారు. మూడు వారాలపాటు నిర్వహించే ఉత్సవాలకు ఎక్కడ లోటుపాటు లేకుండా అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో అధికారులు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న గండ్ర జ్యోతి

ఐనవోలులో..

ఐనవోలు: దశాబ్ది ఉత్సవాలను ప్రతీగ్రామంలో ఘనంగా నిర్వహించాలని, అందుకు అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో కలిసి పనిచేయాలని ఎంపీపీ మార్నేని మధుమతి సూచించారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో పలు శాఖలకు చెందిన అధికారులు, ప్రజా ప్రతినిధులు, పలు గ్రామాలు, మండల రైతుబంధు, వీఓ అధ్యక్షులతో ఎంపీపీ మధుమతి అధ్యక్షతన సన్నాహక సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జూన్ 2నుంచి 22 వరకు కార్యక్రమాల షెడ్యూల్‌ను వివరించారు. కార్యక్రమంలో జెడ్పీవైస్ చైర్మన్ గజ్జెల శ్రీరాములు, మండల ప్రత్యేక అధికారి, డీసీఓ నాగేశ్వర్‌రావు, ఎంపీడీఓ వెంకటరమణ, తహసీల్దార్ రాజేష్, జెడ్పీ కోఆప్షన్ ఉస్మాన్ అలీ, ఏఓ కవిత, ఎస్సై వెంకన్న, అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, రైతుబంధు కోఆర్డినేటర్లు, వీఓ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీపీ మార్నేని మధుమతి